క్లుప్తంగా

షాబూఖారీ దర్గాను సందర్శించిన తిరుపతిరావు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి షాబూఖారీ బాబా దర్గాను మైలవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు శుక్రవారం సందర్శించారు. ఆస్థాన పీఠాధిపతి, మతగురువు మహ్మద్ అల్తాఫ్‌రజా వారికి సాదరస్వాగతం పలికారు. ముస్లిం సంప్రదాయ బద్ధంగా సన్మానించారు. అనంతరం నాయకులతో కలిసి బాబాకు చాదర్ సమర్పించారు. బాబా ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రత్యేక ప్రార్థన చేశారు. రానున్న ఎన్నికల్లో తిరుపతిరావుకు విజయం చేకూర్చాలని అల్తాఫ్‌రజా ప్రార్థన చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు అప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి, వాహెద్, బేగ్, పోరంకి శ్రీనివాసరావు, బాలచందర్ పాల్గొన్నారు.

మసీదుల్లో స్వామిదాసు ప్రత్యేక ప్రార్థనలు



తిరువూరు: పవిత్ర రంజాన్ మాసంలో చివరి శుక్రవారం తిరువూరు జామియా మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింల కోసం మసీదు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇమాం మౌల్వీ రజ్వీ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో తిరువూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు కూడా పాల్గొన్నారు. ముస్లింలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే ప్రతాప్ ప్రచారం

చాట్రాయి: మండలంలోని చిత్తపూరు, తుమ్మగూడెం గ్రామాల్లో శనివారం నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

నూజివీడులో ఇఫ్తార్ విందు

నూజివీడు: ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు మేకా వేణుగోపాల అప్పారావు (చంటి నాయన) అన్నారు. పట్టణంలోని మైలవరం రోడ్డులో ఈద్గా వద్ద ఉన్న మసీదులో, పాతపేటలోని బిలాల్ మసీదులో శుక్రవారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. చంటినాయన పాల్గొని మసీదుల్లో ప్రత్యేక నమాజు చేశారు. వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ యూనస్‌పాషా (గబ్బర్), ముస్లిం నాయకులు షేక్ మున్నీ, షేక్ మస్తాన్, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కౌన్సిలర్ షేక్ మీరాబాయి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌కం ట్యాక్స్ రిటర్నులు దాఖలు చేయాలి



కంచికచర్ల : ఇన్‌కంట్యాక్స్ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ పెన్షనర్లు 2023–24 ఆర్థిక సంవత్సరానికి తప్పనిసరిగా ఇన్‌కంట్యాక్స్ రిటర్న్లు దాఖలు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో శుక్రవారం రిటైర్డ్ ఎంప్లాయిస్‌తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రిటర్నులు దాఖలు చేయనివారు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆ పరిస్థితి రాకుండా ఇన్‌కంట్యాక్స్ రిటర్నులు దాఖలు చేయాలని సూచించారు. విజయవాడ మాక్సివిజన్ ఐ సూపర్ స్పెషాలిటీ వైద్యులు సంఘ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. నలుగురికి క్యాటరాక్ట్ ఆపరేషన్ చేయాలని నిర్ధారించినట్లు వివరించారు. సంఘ నాయకులు ముండ్లపాటి పోతరాజు, చలసాని నాగేశ్వరరావు, బీవీ కృష్ణమూర్తి, చాపలమడుగు స్వర్ణలత, అర్లప్ప పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్

పెనుగంచిప్రోలు: గతనెల 30వ తేదీన పెనుగంచిప్రోలులో కత్తుల దాడి ఘటన చోటుచేసుకోవడంతో గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్ కొనసాగుతోంది. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో పోలీసులు ప్రత్యేక పహారా కాస్తున్నారు. పోలీసు పికెట్‌ను నందిగామ ఏసీపీ రవికిరణ్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, ఎస్ఐ పి. రాంబాబు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో ప్రశాంత వాతావరణం కొనసాగుతోంది.

నేటి తరానికి స్ఫూర్తి జగ్జీవన్‌రామ్

- వాడవాడలా జయంతి కార్యక్రమాలు
- జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడిన నేతలు
- విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళి



నూజివీడులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, నాయకులు



తోటమూల వై–జంక్షన్‌లో కేక్ కట్ చేస్తున్న స్వామిదాసు, నాయకులు



కొండపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు



మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న తిరుపతిరావు, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు



ఎన్టీటీపీఎస్‌లో నివాళులర్పిస్తున్న సీఈ నాగరాజు, అధికారులు



గొల్లపూడి మైలురాయి సెంటర్‌లో నివాళి



ముసునూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

మైలవరం: భారత మాజీ ఉప ప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాలు మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశ వ్యవసాయ మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు, మైలవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, మందా నోవా, వెంకటరత్నం, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

- మైలవరం పాత యూనియన్ బ్యాంక్ సెంటర్‌లో పార్టీలకతీతంగా దళిత నాయకుల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చాట్ల వీరాస్వామి, బాబూరావు, జగ్జీవన్‌రామ్, నిరీక్షణ కుమార్, వంగూరు రమేష్‌బాబు, బొడ్డపాటి దాస్ తదితరులు పాల్గొన్నారు.
- వెల్వడం దళితవాడ సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.
- ఇబ్రహీంపట్నం: కొండపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం, బీకాలనీ, ఇబ్రహీంపట్నం శక్తినగర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దళితులపై జరిగిన అన్యాయాలు, అస్పృశ్యతకు వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. నియోజకవర్గ పరిశీలకుడు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు జోగి రాము, మేడపాటి నాగిరెడ్డి, మిక్కిలి శరభయ్య, వార్డు కౌన్సిలర్ నాగరాజకుమారి, పోరంకి పద్మావతి, ఎంఏబేగ్, ఆనంద్, ఎస్.శివశంకర్‌రావు, పి.శ్రీనివాస రాజు, కోమటి కోటేశ్వరరావు, బోసు, ప్రకాశ్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత జనోద్ధారకుడు జగ్జీవన్‌రామ్

తిరువూరు: సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ విశేష కృషి చేశారని తిరువూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. శుక్రవారం తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వామిదాసు మాట్లాడుతూ సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రగతి సాధించడంలో దళితులకు జగ్జీవన్‌రామ్ దిక్సూచిగా నిలిచారన్నారు. ఫ్యాక్టరీ సెంటర్లోని జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు చలమాల సత్యనారాయణ, రేగళ్ల మోహన్‌రెడ్డి, గత్తం నాగేశ్వరరావు, అజీజ్, జాకీర్, పింగళి గోపి, చంటి, నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, కాకర్లమూడి సుందరకుమార్, పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, పరసా సత్యనారాయణ, ఏరువ ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి మైలురాయి సెంటర్ వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి స్థానిక ఎంపీటీసీ కేతుపల్లి దావీదు పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. గొల్లపూడి గ్రామ పంచాయతీలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్‌లో..

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి చీఫ్ ఇంజినీర్ నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీ జెన్‌కో శిక్షణా కేంద్రంలో ఎస్ఈ సుశీల, జీఎం శ్రీనివాస్‌లు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఏపీఎస్ఈబీ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ బ్రాంచి అధ్యక్షుడు ఉమావిజయ్‌చంద్ ఆధ్వర్యంలో ఎస్ఈలు కృష్ణారావు, వెంకటరావు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

- తోటమూల(గంపలగూడెం): తోటమూల వై–జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. స్వామిదాసు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. జెడ్పీటీసీ కోట శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ శాఖల అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, కొత్తగుండ్ల నరసింహారావు, మాజీ ఎంపీపీ కోట దాసు, నాయకులు గోగులమూడి చెన్నకేశవరెడ్డి, ఆలపాటి ఉమామహేశ్వరరావు, కోట సునీత, ఇడుపులపాటి రాంబాబు, కోట లక్ష్మీనారాయణ, అల్లు కృష్ణారెడ్డి, చెన్నుపాటి శేషగిరిరావు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివి

నూజివీడు: స్వాతంత్య్ర సమరయోధుడిగా, దేశ ఉప ప్రధానిగా దివంగత జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రతాప్ పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా పదవులు నిర్వహించి పలు వ్యవస్థల్లో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ లాంటి మహనీయుల ఆశయాలకనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు లాం ప్రసాదరావు, నాయకులు షేక్ గబ్బర్, పిల్లా చరణ్, కళ్లేపల్లి ఆదినారాయణ, ఉదయగిరి కృపారావు, చేబత్తిన మున్నా, కోటగిరి పూర్ణిమ, కౌన్సిలర్లు కొప్పుల ప్రదీప్, కొడవటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దళిత బాంధవుడు

రాయనపాడు(విజయవాడరూరల్): దళితుల అభ్యున్నతికి కృషి చేసిన దళిత బాంధవుడు జగ్జీవన్‌రామ్ అని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంద వెంకటేశ్వరావు మాదిగ అన్నారు. శుక్రవారం రాయనపాడు అశోక్‌నగర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి దళిత నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పోలసాని వాసు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బయ్యారపు కిషోర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు కోటా దానియేలు, మల్లాది వెంకటేశ్వరరావు, కలపాల రాజేష్, మాజీ సర్పంచి తలారి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

- విస్సన్నపేట: దళిత బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు పాల్గొని నివాళులర్పించారు. దళిత బహుజన ఐక్య వేదిక నాయకులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొర్రె లాజరస్, కొండా రాజ్‌కుమార్, పల్లెపాం లక్ష్మయ్య, పిల్లి రాజేష్, మేకల జ్ఞానరత్నం, జేటీ రాజేంద్రప్రసాద్, మల్లయ్యస్వామి, ఎ. కుమార్, బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: ముసునూరు, లోపూడిలో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. లోపూడిలో స్థానిక జగ్జీవన్ యూత్ అధ్యక్షుడు బందెల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు దేవరాజు అధ్యక్షతన జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వరికూటి ప్రతాప్, నాయకులు క్షీరాభిషేకం చేశారు. జగ్జీవన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు. ముసునూరులో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గోపాలకృష్ణ, సుబ్బారావు, సురేష్, బాబూరావు, జ్వానేష్, డేవిడ్, రుద్రయ్య పాల్గొన్నారు.



తిరువూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు



విస్సన్నపేటలో నివాళులర్పిస్తున్న ఐక్యవేదిక నాయకులు

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్

నల్లగట్ల స్వామిదాసు



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న స్వామిదాసు

తిరువూరు: గత ఐదేళ్లలో రాష్ట్రంలో అమలు జరిగిన సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో సమగ్ర మార్పు వచ్చిందని తిరువూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరు పట్టణంలోని 9వ వార్డులో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చేతివృత్తులవారికి చేయూత ఇస్తూ, మహిళలకు ఆర్థిక భరోసా, చిన్న వ్యాపారులకు తోడుగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని స్వామిదాసు అన్నారు. రాజకీయాల కతీతంగా ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరాలనే ధ్యేయంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బురద జల్లాలని, వృద్ధులు, దివ్యాంగుల కిచ్చే పెన్షన్లను సైతం నిలిపివేయించాలని కూటమి నాయకులు చేస్తున్న కుట్రలను ప్రజలు గమనించాలని కోరారు. దీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేశానని చెప్పుకునే చంద్రబాబు తన ప్రభుత్వంలో పేదలకు చేకూర్చిన లబ్ధి శూన్యమన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు మూడు దుర్గారావు, గుంటూరు మస్తాన్, కాకర్లమూడి సుందరకుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

9వ వార్డులో సుధారాణి ప్రచారం..

తిరువూరు: స్థానిక 9వ వార్డులో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు గెలుపు కోరుతూ కృష్ణా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి ఫ్యాను గుర్తుకే ఓట్లు వేయాలని కోరారు. పార్టీ నాయకులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభ్యున్నతికి జగన్ ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



చాట్రాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రతాప్ అప్పారావు

చాట్రాయి: వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా ఎదుగుతున్నారని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. శుక్రవారం చాట్రాయిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ 58 నెలల పాలనలో జగన్ మోహన్‌రెడ్డి పలు పథకాల ద్వారా అర్హులైన పేదల ఖాతాలో నగదు జమ చేశారని, ఆ డబ్బుతో వారు పలు రకాల వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకుంటున్నారని చెప్పారు. చాట్రాయి గ్రామంలో ఈ 58 నెలల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా కోట్లాది రూపాయలు పేదల బ్యాంకు ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారని తెలిపారు. గత టీడీపీ పాలనలో ఇంత నగదు పేదలకు దక్కిందా అని ఆయన ప్రశ్నించారు. మళ్లీ పేదల సంక్షేమ ప్రభుత్వం రావాలంటే ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని ఆయన కోరారు. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ దామెర ఉష, ఎంపీటీసీ సంకు శివకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్ మోహనరావు, నాయకులు దామెర ప్రసాద్ బాబు, చెలికాని బాబ్జీ తదితరులు పాల్గొన్నారు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

విస్సన్నపేట: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను, బోర్డర్ చెక్ పోస్టులను మైలవరం ఏసీపీ ఎస్. మురళీమోహన్ శుక్రవారం పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ ఎస్‌కే అబ్దుల్‌నబి, ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



చాట్రాయి: సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించాలని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్‌వీ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణారావుపాలెం, పర్వతాపురం సరిహద్దు వద్ద చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ అక్రమ మద్యం, నగదు తరలింపును అడ్డుకోవాలని సూచించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

నూజివీడు: ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. విజయవాడ రోడ్డులోని రాజీవ్‌సర్కిల్ వద్ద కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పట్టణ పోలీసులు పట్టణం వైపునకు వచ్చే వాహనాలను, విజయవాడ వైపు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపుతున్నారు. కార్లు, ఆటోలు, ట్రక్కు వాహనాలను ఆపి గాలిస్తున్నారు.

ఆగిరిపల్లి: చెక్‌పోస్టుల వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ జి.లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం అడవి నెక్కలం చెక్‌పోస్టు వద్ద డీఎస్పీ ఆధ్వర్యంలో అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గంజాయి, సారా, అక్రమ మద్యం, నగదు, నిషేధిత వస్తువులు రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. అనంతరం అడవి నెక్కలంలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు.

టీడీపీ ఇఫ్తార్ విందుకు మైనార్టీలు దూరం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ముస్లింలకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకులు దూరంగా ఉన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వ్యక్తులకు ఇఫ్తార్ బాధ్యతలు అప్పగించడంతో మొదటి నుంచి టీడీపీలో కొనసాగుతున్న నాయకులు దూరమవడం చర్చనీయాంశమైంది. వసంత తీరుతో ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాంతాలకు చెందిన మైనార్టీ సీనియర్ నేతలు గుర్రుగా ఉన్నారు. గతంలో ఇబ్రహీంపట్నంలో ముస్లిం నేతలు రంజాన్ మాసంలో భారీగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసేవారు. ఆ నేతలు ఎవ్వరూ ఈ విందులో పాల్గొనక పోవడంతో టీడీపీలో వర్గ విభేదాలు బయట పడ్డాయి. ఎన్నికల సమయంలో అందరి సమన్వయంతో నిర్వహించాల్సిన కార్యక్రమం ఓ వ్యక్తి పర్యవేక్షణలో జరపడంపై వారు అలకబూనారు. ఈ పరిణామం రానున్న ఎన్నికల్లో ప్రభావం చూపుతుందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు



వెంకటాపురం(పెనుగంచిప్రోలు): మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పంట కాలువల పూడికతీత, కంప చెట్లు తొలగింపు తదితర పనులను చేస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు, ఉదయం 10 గంటల కల్లా పనులు నిలిపివేస్తున్నట్లు ఉపాధి హామీ పథకం అధికారులు తెలిపారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు, కృష్ణారావుపాలెం, కంభంపాడు గ్రామాల్లో శుక్రవారం ముస్లింలు పవిత్ర రంజాన్ మాసంలో చివరి శుక్రవారం సందర్భంగా ఇమామ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఇమామ్‌లు మాట్లాడుతూ పవిత్ర రంజాన్‌మాసంలో ఉపవాస దీక్షాపరులు ఉపవాస దీక్షలు చేయడం అల్లా చూపిన సన్మార్గంలో నడవడమేనన్నారు. ఈ మాసంలో ధనికులు నిరుపేదలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గంలో నడవాలని ఉద్బోధించారు.